క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: మల్లవరంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి చెప్పారు. కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలి కోరారు.

ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సంఘం నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జ్యోతిరావు పూలే పార్కు ఆవరణలో ముదిరాజ్ సంఘ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందిళ్లపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఆకుమల కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు పందిళ్లపల్లె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నక్కనబోయిన ప్రభుదాస్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

బేస్తవారిపేట: మండలంలోని ఎంపీ చెరువు సమీపంలోని పొలాల్లో పేకాట శిబిరంపై ఎస్సై మాధవరావు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 5400 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న, నాటుసారా తయారీ, అమ్మకాలు జరుపుతున్న వ్యక్తుల వివరాలు పోలీసులకు అందజేయాలని ఎస్సై కోరారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి



పోతురాజు మృతదేహం

పులివెందుల: పట్టణంలోని రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవలపాడు గ్రామానికి చెందిన పోతురాజు(38) పులివెందులకు కొన్ని నెలల క్రితం వచ్చి బేల్దారీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మరికొంత మందితో కలిసి సరదాగా రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో ఈత కోసం వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఆయన ఈత కొడుతూ నీటిలో కనిపించకుండా గల్లంతయ్యాడు. దీంతో అక్కడి వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీం నీటి కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. నీటిలో మునిగి చనిపోయిన పోతురాజును బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోతురాజుకు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీ

బల్లికురవ: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ముడిరాయి లారీని మైన్స్ అండ్ విజిలెన్స్ అధికారులు శనివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి మల్లాయపాలెం మీదుగా వేమవరం జంక్షన్ వైపు వెళ్తున్న లారీని తనిఖీ చేసి పర్మిట్లుగా గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. గ్రానైట్ శ్లాబులు ముడిరాళ్లు, మీటరు రాళ్లను పర్మిట్ లేకుండా అక్రమంగా తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. లారీని సైతం సీజ్ చేస్తామని వీరేష్ హెచ్చరించారు.

మురుగు పాపం టీడీపీదే..

- గత ప్రభుత్వ హయాంలో అడ్డదిడ్డంగా మురుగు కాల్వల నిర్మాణం
- ఒక వర్గం వారికి మేలు చేసేలా ప్రణాళిక
- లక్షలు ఖర్చు చేసి పనులు చేసినా దరుద్దేశ పూర్వకంగా రాతలు
- ఖండిస్తున్న స్థానిక ప్రజలు





గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణం చేస్తున్న కూలీలు (ఫైల్)

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని దోసకాయలపాడు ఎస్సీ కాలనీలో మురుగు పారడం లేదని ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని ఆ గ్రామ సర్పంచ్ ఖండించారు. గత టీడీపీ పాలనలో కాలనీలో మురుగు కాల్వల నిర్మాణం అడ్డదిడ్డంగా నిర్మించారు. కాలనీకి తూర్పు వైపుకి నీరు పారేలా సైడు కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా టీడీపీ వర్గీయులకు మేలు చేసేలా విరుద్ధంగా పడమర వైపుకి నీరు పారేలా నిర్మించారు. దీంతో వర్షాలు పడిన సమయంలో నీరు పడమర వైపుకి పోవడం లేదు. ఒక వేళ అటు వెళ్లినా టీడీపీ అనుకూలుర పొలాలు ఉండడంతో వారు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో మురుగు నీరు ఇళ్లలోకి లేదా రోడ్డుపైనే ఉండే దుస్థితి నెలకొంది. కోటా శివలక్ష్మీ వెంకట రామిరెడ్డి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాక 2021– 2022 సంవత్సరంలో లక్షా నలభై వేలతో సైడు కాల్వల మరమ్మతులు చేపట్టినా నీరు గ్రామం బయటకు పోతుండగా టీడీపీ అనుకూలురు అడ్డుకట్ట వేయడంతో మురుగు నీరు పోయే వీలు లేక ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా సైడు కాల్వలు నిర్మించడంతో నేడు సమస్యగా మారిందని కాలనీ వాసులు తెలిపారు.



టీడీపీలో చేసిన పాపాన్ని మాకు ఆపాదించడం సరికాదు:
ఎస్సీ కాలనీలో సైడు కాల్వల నిర్మాణంలో గత టీడీపీ పాలనలో చేపట్టారు. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో నేడు మురుగు నీరు గ్రామం బయటకు వెళ్లే వీలు లేకుండా పోయింది. ఇప్పటికే ప్రతి ఏటా కాలువలలో మురుగు తీపిస్తున్నా.. వర్షాలు ఎక్కువగా పడితే నీరు బయటకు పోవడం లేదు. కావాలనే మా మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.
– సర్పంచ్, కోటా శివలక్ష్మీ వెంకటరామిరెడ్డి

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు



శాకంబరిగా దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ పూజలు, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి భక్తులు 12 చీరెలు బహూకరించారు. ఆలయానికి 16914 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ భాస్కరరెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాకంబరిగా పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించి ఆదివారం పూజలను నిర్వహించారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, దేవీ ఖడ్గమాల, సహస్ర నామార్చన పూజలను అర్చకులు దేవులపల్లి పవన్‌కుమార్ శర్మ చేశారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

యాదవులు ఐకమత్యంతో ఉండాలి



జడ్జి: ఎంఈఓలకు సన్మానం చేస్తున్న యాదవులు

గిద్దలూరు రూరల్: యాదవులు ఐకమత్యంతో ఉండాలని యాదవ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ డా.మొర్రిపిచ్చయ్య అన్నారు. పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన యాదవుల ఆత్మీయ సభ కార్యక్రమంలో కనిగిరి పట్టణంలో జడ్జిగా ఎంపికైన కటారు బాలరాజును, గిద్దలూరు ఎంఈఓ- 2 జింకా వెంకటేశ్వర్లు, కొమరోలు ఎంఈఓ -2 గా బొర్రా వెంకటరత్నాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. యాదవుల సమస్యల కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ రాజకీయంగా పూర్తిగా వెనుకబడి ఉన్నామని గుర్తు చేశారు. ఆవులరాజు, కొత్తకోట పోలయ్య యాదవ్, యాదవ సేవా సమితి అధ్యక్షుడు గొంగటి శ్రీదర్‌యాదవ్, విజయరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరిన సంజీవరాయుడుపేట నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే అన్నా రాంబాబు నివాస గృహంలో మండలంలోని సంజీవరాయుడుపేట వైఎస్సార్ సీపీ నాయకులు, జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు ఆధ్వర్యంలో తిరిగి పార్టీలో చేరారు. మూడు రోజుల క్రితం తెలుగు దేశం పార్టీ నాయకులు సంజీవరాయుడుపేట గ్రామం ఎస్సీ పాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులను మభ్యపెట్టి టీడీపీ కండువాలు కప్పారు. అనంతరం జెడ్పీటీసీ మధు ఆధ్వర్యంలో తిరిగి తమ సొంత పార్టీలోనే చేరుతున్నామని తెలిపారు. కుప్పా రంగనాయకులు, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

కిట్స్‌లో ముగిసిన టీచర్ల శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

మార్కాపురం: విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధన చేయాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య చెప్పారు. స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మార్కాపురం డివిజన్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన 767 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు గత 12 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన చైతన్య మాట్లాడుతూ బైజూస్ యాప్, డిజిటల్ క్లాస్‌రూముల ద్వారా విద్యార్థులకు బోధన చేయాలని చెప్పారు. దీనితోపాటు విద్యా బోధనలో స్మార్ట్ టీవీల వాడకం, ఐఎఫ్‌పీఎస్‌లు కూడా వచ్చాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న ఆధునిక పద్ధతులను విద్యార్థులకు వివరించాలన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్‌బాషా, ట్రైనర్లు కె. రాముడు, జి. వెంకటేశ్వర్లు, నబీ, జిలానీ, అమృతవల్లి, స్వరూపారాణి, రాజు, రవికుమార్‌లు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, కోర్సు డైరెక్టర్ మార్కాపురం ఎంఈఓ-2 శ్రీనివాసులు పాల్గొని పలు సూచనలు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం వాహనం వద్ద డీటీ చంద్రశేఖర్

మార్కాపురం టౌన్: బేస్తవారపేట నుంచి నేషనల్ హైవేపై వాహనంలో అక్రమంగా తరలుతున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి మార్కాపురం మండలం కుంట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు రేషన్ గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

కనిగిరిలో శాంతియుత నిరసన



కనిగిరిలో శాంతియుత నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

కనిగిరి రూరల్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను ఖండిస్తూ కనిగిరిలో దుర్గం బాప్టిస్ట్ చర్చి క్రైస్తవులు ఆదివారం శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుర్గం బాప్టిస్ట్ చర్చి చైర్మన్ గంటా విద్యాసాగర్ మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులను ఆపాలన్నారు. కొన్ని రాష్ట్రాల్లో క్రైస్తవులపై, దైవ సేవకులపై దాడులు చేయడం, హింసించడం, చర్చిలు తగులబెట్టడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మౌనం వీడి బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. మణిపూర్‌లోని క్రైస్తవులకు సంఘీభావం తెలుపుతూ, ధైర్యంగా ఉండాలని, వారి కొరకు ప్రార్థన చేశారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ తాతపుడి సర్వోన్నత కుమార్, ట్రెజరర్ వై డి.రత్నకుమార్, సంఘ కమిటీ నాయకులు జి.అశోక్, విజయభాస్కర్, కె. ప్రశాంత్, వై వెస్లీ, తేళ్ల రాజేంద్ర, తాతపూడి శ్యామ్యుల్, విల్‌ఫ్రెడ్, యూత్ డైరెక్టర్ గోనా సదానందం, దాని బాబు పాల్గొన్నారు.

మాస శివరాత్రికి ప్రత్యేక హోమాలు



త్రిపురాంతకం ఆలయంలో పూజలు

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. త్రిపురాంతకంలోని ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం వేదపండితులు నిర్వహించారు. అర్చకుడు విశ్వనారాయణ శాస్త్రి ప్రత్యేక పూజలు చేయగా, ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు సుబ్బారావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తి

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో కంభం వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎంపీ సందీప్‌కుమార్, కె. కీర్తి, బీపీ రంగనాయకులు 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మేకల రాజేశ్వరి, కోనపల్లె మాజీ సర్పంచ్ నాదేళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.